క్లుప్తంగా

సప్తకనికలమ్మ సేవలో మంత్రి



చిత్తూరు రూరల్: నగరంలోని దొడ్డిపల్లిలో ఉన్న శ్రీసప్తకనికలమ్మను బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి దీపం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి తదితరులు ఉన్నారు.

నాగేశ్వర్ సేవలు విలువైనవి



నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న ఎస్ఈ సుబాన్‌బాషా

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఈ నాగేశ్వర్ సేవలు విలువైనవని ఎస్ఈ సుబాన్‌బాషా తెలిపారు. చిత్తూరులో ఆయన బుధవారం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. పలు సంవత్సరాలుగా నిబద్ధతతో సంస్థలో పనిచేశారన్నారు. ఉద్యోగికి పదవీ విరమణ సాధారణమని, మలివయసులో ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణమనాయుడు, బాబు రాజేంద్ర, ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, శ్రీనివాసన్, నందకుమార్, డీఈ శేషాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, నరసారెడ్డి, సురేష్, తులసీబాబు, జగదీష్ పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు జ్యోతి



చిత్తూరు కలెక్టరేట్: ఢిల్లీలో జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం పరేడ్‌కు సావిత్రమ్మ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైందని ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ వెల్లడించారు. ఈ మేరకు ఆమె బుధవారం మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న 35 మంది విద్యార్థులు పరేడ్‌లో పాల్గొంటారన్నారు. ఈ పరేడ్‌కు తమ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జ్యోతి ఎంపికవడం హర్షణీయమన్నారు.

అపూర్వ షోరూం ప్రారంభం



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మిట్టూరులో బుధవారం నూతనంగా అపూర్వ సిల్క్ షోరూంను ప్రారంభించారు. ఆధునిక డిజైన్లు, పిల్లలు, పెద్దలకు కావాల్సిన అన్ని రకాల దుస్తులు అందుబాటులోకి తెచ్చామన్నారు. దీపావళికి ఉచిత బహుమతులు ఇవ్వనున్నట్లు యజమాని రంజిత తెలిపారు.

బస్సు యాత్రను జయప్రదం చేద్దాం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో నిర్వహించే సామాజిక సాధికారత బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత 4.5 సంవత్సరాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చేసిన మేలును యాత్రలో తెలియజేస్తామన్నారు. గతంలో ఎవరూ చేయని మేలును జగనన్న ఆయా సామాజిక వర్గాలకు చేశారన్నారు. బస్సు యాత్ర గురువారం చిత్తూరు నగరంలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు. స్థానిక కట్టమంచిలో యాత్ర మధ్యాహ్నం ప్రారంభమై నాగయ్య కళాక్షేత్రం వద్ద బహిరంగ సభకు చేరుకుని రాత్రి ముగుస్తుందన్నారు. దీనికి డిప్యూటీ సీఎంలు నారాయణ స్వామి, అంజాద్‌బాషా, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు, విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, పలువురు నామినేటెడ్ నాయకులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కో–ఆప్షన్ మెంబర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్ర సాగుతుందిలా..

- ప్రజాప్రతినిధులు కట్టమంచి కల్యాణ మండపానికి మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం1–2 గంటలకు తటస్థులు, ప్రభావవంతులతో మండపంలో సమావేశం అవుతారు.
- మధ్యాహ్నం 2–2.30 గంటలకు వారితో కలిసి అక్కడ భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం 2.30–2.45 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు.
- మధ్యాహ్నం3–3.30 గంటలకు అక్కడి నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది.
- మధ్యాహ్నం 3.45 గంటలకు బస్సు యాత్ర నాగయ్య కళాక్షేత్రం వద్దకు చేరుకుంటుంది.
- సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో వక్తలు ప్రసంగించనున్నారు.

వినాయకుని సన్నిధిలో ప్రముఖులు





ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన మిత్ర బృందంతో, సాయంత్రం కాకినాడ ఎమ్మెల్సీ పద్మశ్రీ తన కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని చిత్తూరుకు చెందిన రవికుమార్ ఆలయ అధికారులకు అందించారు. ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం





యాదమరి: కాశిరాళ్ల పాఠశాలలో, తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టిశ్రీరాములుకు నివాళి

యాదమరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విశేష ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూజలు చేసి, నివాళులర్పించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంఈఓ హేమలత, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు హరిరెడ్డి, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వ ర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మధుకుమార్, జగన్నాథరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై చర్యలు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో చెరువులు ఆక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ అరుణ నగర ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు ప్రాంతాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. దుర్గానగర్ కాలనీ చెరువు, కట్టమంచి చెరువు, బుడమాల చెరువులో ఆక్రమణలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

82 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బుధవారం వేకువజాము నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సాయంత్రానికి 82 శాతం పూర్తయిందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి



వంటపాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తవణంపల్లె: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ హేమలత తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం జగనన్న గోరుముద్ద కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటపాత్రలను పంపిణీ చేశారు. ఎంఈఓ హేమలత మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో ఉచితంగా నాణ్యత కలిగిన వంట పాత్రలను సరఫరా చేసినట్లు వివరించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయి పెంచాలని సూచించారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరిరెడ్డి, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుకుమార్, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

గుడిపాల: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేష్(53) మూడు నెలల క్రితం పనికి చేరాడు. మధ్యాహ్నం ఆ కంపెనీ వద్ద నడుచుకుంటూ వెళుతూ కిందపడిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఏఎస్ఐలు చల పతి, మునివేలు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సైబర్ నేరగాళ్లు రెప్పపాటులో దోచేస్తారు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట సుబ్బమ్మ

చిత్తూరు రూరల్: సైబర్ నేరగాళ్లు కళ్లుమూసి తెరిచేలోపు దోచేస్తున్నారని బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ తెలిపారు. మండలం బీఎన్ఆర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమాయక ప్రజలను బహుమతులు, లక్కీడిప్ పేరుతో ఫోన్ చేసి, ఓటీపీ అడిగి, బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు దోచేస్తున్నారన్నారు. లేకుంటే ఆధార్ ఓటీపీ, ఏటీఎం కార్డు, ఇలా పలు రకాలుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రవి, జ్యోతి, కళాశాల బృందం, తల్లిదండ్రులు ఉన్నారు.

సురక్ష శిబిరంలో 323 మందికి వైద్య పరీక్షలు



సురక్ష కిట్‌ను అందజేస్తున్న వైద్యులు

బంగారుపాళెం: మండలంలోని గుంతూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 323 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ మాట్లాడుతూ, మండలంలో ఇప్పటి వరకు 24 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. అనంతరం రోగులకు, వృద్ధులకు జగనన్న కిట్లు, కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ద్రాక్షాయణి, ఎంపీటీసీ సభ్యురాలు గోమతి, వైద్యులు రమేష్, మాధురి, వినీత, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఐరాల: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గర్భిణులకు మధుమేహం, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ పాల్గొన్నారు.

55 మందికి వైద్య సేవలు

గుడిపాల: మండలంలోని నారగల్లులో బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 55 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గీత, దివ్య, కవిత, సుమతి పాల్గొన్నారు.